సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 21 । మార్చి । 2025




డీసీఎం బీభత్సం

అదుపు తప్పిన డీసీఎం వ్యాన్ బీభత్సం సృష్టించింది. వరుసగా ఐదు వాహనాలను ఢీ కొట్టింది. 8లో▸



ప్రైవేటు హాస్టళ్ల ఇష్టారాజ్యం!

ప్రైవేటు హాస్టళ్లపై పర్యవేక్షణ కరువైంది. పట్టించుకునే వారు లేక యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. 8లో▸



న్యూస్‌రీల్

'ఓవర్సీస్ విద్యానిధి'కి దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం 2024–25 సంవత్సరానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా ఉప సంచాలకుడు రామరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం కింద యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, ఇంగ్లాండ్, స్విట్జర్లాండ్, కెనడా, న్యూజిలాండ్, సింగపూర్, సౌత్‌కొరియా, ఆస్ట్రేలియా, జర్మనీల్లోని విదేశీ విద్యాలయాల్లో మెడిసిన్, ఇంజినీరింగ్, ఫార్మసీ ప్రొఫెషనల్ కోర్సుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్, పీహెచ్‌డీ కోర్సుల్లో ఉన్నత చదువులు చదవాలనుకొంటున్న విద్యార్థులకు రూ.20 లక్షల ఆర్థిక సాయం మంజూరు చేయడానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి గల ఎస్సీ విద్యార్థులు సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లతో నిర్ణీత ఫార్మాట్‌తో ప్రవేశం పొందేందుకు ఈపాస్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి మే 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అంకెల గారడీ బడ్జెట్

- విద్యారంగానికి అత్తెసరు నిధులు
- బీఆర్‌ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీగా ఉందని.. విద్యారంగానికి 7.5 శాతం నిధులు కేటాయించడం సిగ్గుచేటని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.రాజ్‌కుమార్ విమర్శించారు. బడ్జెట్‌లో విద్యారంగానికి జరిగిన కేటాయింపులను నిరసిస్తూ బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో గురువారం ఇబ్రహీంపట్నంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. రాజస్థాన్, ఢిల్లీ లాంటి రాష్ట్రాలు విద్యకు 20 శాతం కేటాయిస్తుంటే.. మనదగ్గర మాత్రం 7 శాతం దాటలేకపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలప్పుడు విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీలో రెండుసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టినా నిధుల కేటాయింపులో ఎందుకు వివక్ష చూపుతోందని ప్రశ్నించారు. కేటాయించిన నిధులను సైతం సక్రమంగా విడుదల చేయడం లేదన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చింతకింది వీరేశ్, కానుగుల మహేశ్, ఎర్రుల ప్రసాద్, పల్లాటి వినోద్, విష్ణు, కొంద్రు రవి, ఉదయ్, వంశీ, శివ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లు ఆమోదంపై హర్షం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: అసెంబ్లీలో 42శాతం బీసీ బిల్లు ఆమోదం పొందడంపై జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐఎల్‌పీఏ ప్రెసిడెంట్ పొన్నం దేవరాజ్ గౌడ్, జిల్లా రమేష్, బొడ్డు భిక్షపతి గౌడ్, శంకరయ్య, భిక్షమయ్య, బర్ల సునీత, కేరిత్, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవల కోసం మెడ్ ఫ్లాష్ యాప్

అప్లికేషన్ వినియోగంపై జలమండలి అవగాహన

సాక్షి, సిటీబ్యూరో: జలమండలిలో హెల్త్ కార్డు కలిగిన ఉద్యోగులు, పెన్షనర్లకు సులభతరమైన ఆరోగ్య సేవల కోసం రూపొందించిన మెడ్ ఫ్లాష్ అప్లికేషన్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ కార్డులున్న ఉద్యోగులకు ఇలాంటి క్యాష్‌లెస్ సర్వీస్ అందించడం దేశంలోనే మొదటిసారి. జలమండలిలో ఉద్యోగులు, పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్స్ దాదాపు 6,685 మందికి హెల్త్ కార్డులు ఉన్నాయి. వీరితో పాటు వీరి మీద ఆధారపడిన వారందరూ దీని ద్వారా సంవత్సరానికి రూ. 3 లక్షల వరకు ఉచిత సేవలను పొందవచ్చు.తాజాగా పెన్షనర్లకు సైతం అప్లికేషన్ వినియోగంపై అవగాహన కల్పించారు. జలమండలిలో జరిగిన కార్యక్రమంలో ఈడీ మయాంక్ మిట్టల్ మాట్లాడుతూ.. బోర్డు ఉద్యోగుల ఆరోగ్య సేవల కోసం ఈ యాప్ తీసుకొచ్చామన్నారు. వైద్య సేవల కోసం ఆసుపత్రుల చుట్టూ తిరగకుండా యాప్ ద్వారా సేవలు పొందే అవకాశం కల్పించామని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో యాప్‌ను ఉపయోగించి అంబులెన్స్ సేవలు సైతం పొందవచ్చన్నారు.



విజయోస్తు

నేటి నుంచి 'పది' పరీక్షలు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు	పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు	పోలీసుల పటిష్ట బందోబస్తు

జిల్లాలో పరీక్ష కేంద్రాలు : **249**

హాజరయ్యే విద్యార్థులు: **51,794**

సమయం: ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30

సందేహాల నివృత్తి కోసం కంట్రోల్ రూం నంబర్లు: 70322 53057, 96760 16539



శివరాంపల్లిలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఈఓ సుశీందర్ రావు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పదో తరగతి వార్షిక పరీక్షలకు అంతా సిద్ధమైంది. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 51,794 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం 249 కేంద్రాలను ఎంపిక చేశారు. పది ఫ్లయింగ్ స్క్వాడ్, 249 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. నిర్దేశిత సమయానికి గంట ముందే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించనున్నారు. తర్వాత ఉదయం 9.35 గంటలకు వచ్చిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని జిల్లా విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. అనుమానాల నివృత్తి కోసం 70322 53057, 96760 16539 కంట్రోల్ రూమ్ నంబర్లకు ఫోన్ చేయొచ్చని సూచించారు. తొలి రోజు ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించనున్నారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను ముందే మూసివేయించనున్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

పదోతరగతి పరీక్షలను అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈఓ సుశీందర్‌రావు వెల్లడించారు. ఈ మేరకు ఆయన గురువారం శివరాంపల్లిలోని పరీక్ష కేంద్రాన్ని సందర్శించి, ఏర్పాట్లను పర్యవేక్షించారు. తాగునీరు, ఫ్యాన్లు, లైట్లు, ఫర్నిచర్ వంటి మౌలిక సదుపాయాలను సమకూర్చాల్సిందిగా సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. పరీక్షల నిర్వహణలో ఏ చిన్న పొరపాటుకు ఆస్కారం ఇవ్వొద్దని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

విద్యార్థులు ఇలా చేయండి

- విద్యార్థులు విధిగా తమ హాల్ టికెట్లను వెంట తీసుకెళ్లాలి.
- ఏమైనా పొరపాట్లు దొర్లితే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.
- హాల్ టికెట్లు లేని వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు.
- నీలం లేదా నల్ల బాల్ పాయింట్ పెన్నుతో మాత్రమే పరీక్ష రాయాలి.
- వైట్ ఇంక్ లేదా కరెక్షన్ ఫ్లూయిడ్స్ సహా సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను లోనికి అనుమతించరు.
- సాధారణ పత్రాల కోసం 24 పేజీల బుక్‌లెట్ మాత్రమే ఇస్తారు. అదనపు పేజీలు ఇవ్వరు.
- భౌతిక, జీవశాస్త్రాలకు 12 పేజీల బుక్‌లెట్స్ ఇవ్వనున్నారు. ఈ బుక్ లెట్‌లోనే సమాధానాలు పూర్తి చేయాలి.

తల్లిదండ్రులకు సూచనలు

- వార్షిక పరీక్షలు అనగానే చాలామంది తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన చెందుతుంటారు. తమ పిల్లలను ఇతర పిల్లలతో పోల్చి చూస్తుంటారు. ఇలా చేయడం ద్వారా విద్యార్థి మరింత కుంగిపోయే అవకాశం ఉంది.
- ఇంట్లో ప్రశాంతమైన, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే వాతావరణం కల్పించాలి.
- ఎలాంటి భావోద్వేగాలకు లోను కానివ్వొద్దు.
- పిల్లలను నిర్దేశిత సమయానికి ముందే పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లాలి. సెంటర్ల వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తే ఆస్కారం ఉంటుంది. టూ వీలర్లపై తీసుకురావడమే ఉత్తమం.

సమాధానాలు ఇలా రాయండి

- ప్రశ్నపత్రాన్ని పూర్తిగా చదివిన తర్వాతే జవాబులు రాయడం ప్రారంభించాలి.
- సమయాన్ని సద్వినియోగం చేసుకుని, సమాధానం స్పష్టంగా రాయాలి.
- సాధ్యమైనంత వరకు అర్థవంతంగా, అక్షర దోషాలు లేకుండా రాయాలి.
- అవసరమైతేనే సమాధానం కొట్టివేయండి. లేదంటే పేజీ వృథా అవుతుంది.
- ముందు తెలిసిన ప్రశ్నలకు జవాబులు రాసి, ఆ తర్వాత క్లిష్టమైన ప్రశ్నలకు మొదలు పెట్టడం ఉత్తమం.

ఆరోగ్యం ప్రధానం

- రాత్రంతా మేల్కొని చదవడం కన్నా కంటి నిండా నిద్రపోయి ప్రశాంతంగా ఉండడం ఉత్తమం.
- చాలా మంది పిల్లలు ఉదయం ఏమీ తినకుండా పరీక్ష కేంద్రానికి వస్తుంటారు. స్పృహతప్పి పడిపోతుంటారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతూ అస్వస్థతకు గురై, చివరకు పరీక్ష సరిగా రాయలేకపోతుంటారు.
- నూనెలో వేయించిన మసాలా పుడ్డు కాకుండా తేలికగా జీర్ణం అయ్యే ఆహారం అందించాలి. పగటి ఉష్ణోగ్రతలకు బాడీ డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. సాధ్యమైనంత ఎక్కువ నీరు తాగాలి.
- ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఎలాంటి గందరగోళానికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలి.



బండలాగు.. బహుమతి పట్టు

తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన పోటీలను స్థానికులు ఆసక్తిగా తిలకించారు. విజేతలకు నిర్వాహకులు మొదటి బహుమతిగా రూ.1.20 లక్షల నగదు, రెండో బహుమతిగా రూ.90 వేల నగదును అందించారు.

– ఆమనగల్లు

మాసబ్ చెరువు నుంచి మట్టి తొలగింపు

- ఎఫ్‌టీఎల్‌లో డంప్‌పై ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- చర్యలకు ఉపక్రమించిన అధికార యంత్రాంగం
- హుటాహుటిన మట్టి తొలగింపు పనులు ప్రారంభం

తుర్కయంజాల్: మున్సిపల్ పరిధిలోని మాసబ్ చెరువు ఎఫ్‌టీఎల్‌లో మట్టి, బండరాళ్లను తొలగించే పనులు ప్రారంభమయ్యాయి. బీఆర్ఎస్ హయాంలో మాసబ్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో రోడ్డు నిర్మాణానికి పెద్ద ఎత్తున మట్టి, బండరాళ్లను డంప్ చేసినా పట్టించుకోలేదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఇటీవల అసెంబ్లీలో ప్రస్తావించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో దీనిపై స్పందించిన హైడ్రా, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు గురువారం ఉదయం పెద్ద ఎత్తున పోలీసు బలగాలతో మాసబ్ చెరువు వద్దకు చేరుకున్నారు. జేసీబీలతో సాయంతో మట్టి, బండరాళ్లను తొలగించే పనులు మొదలుపెట్టారు. కార్యక్రమంలో హైడ్రా ఎంక్వయిరీ అధికారి బాచిరెడ్డి, సీఐ తిరుమలేష్, ఇరిగేషన్ డీఈ చెన్న కేశవరెడ్డి, ఏఈ వంశీ, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు, మీర్‌పేట సీఐ కీసరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

2023 మేలో..

రైతుల ముసుగులో కొందరు రియల్ వ్యాపారులు 2023 మేలో వందల టిప్పర్ల మట్టి, పెద్దపెద్ద బండరాళ్లను, చెరువు శిఖం సర్వే నంబర్ 137లో డంప్ చేశారు. చెరువులో 5 నుంచి 6 అడుగుల నీరున్నప్పటికి 60 ఫీట్ల విస్తీర్ణంతో రోడ్డు వేసేందుకు ప్రయత్నాలు చేశారు. గుర్రంగూడ వైపు నుంచి జన సంచారం ఎక్కువగా లేకపోవడంతో రాత్రి వేళ యథేచ్ఛగా పనులు మొదలుపెట్టారు. దీనిపై 'సాక్షి'లో వరుసగా కథనాలు రావడంతో స్పందించిన అధికారులు కొందరిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ తరువాత మట్టిని తొలగిస్తామని హడావుడి చేసిన అధికారులు చేతులు దులుపుకొన్నారు.



జేసీబీతో చెరువు నుంచి తొలగిస్తున్న మట్టి

హైడ్రా ఏర్పాటుతో..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హైడ్రా ఏర్పాటు చేసి చెరువుల పరిరక్షణకు చర్యలు చేపట్టడంతో చెరువు మధ్యలో నుంచి వేసిన ఈ రోడ్డుపై కూడా ఫిర్యాదులు అందాయి. దీనికి స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఈ ఏడాది జనవరి 8న రోడ్డును స్వయంగా పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డంప్ చేసిన మట్టిని తొలగించి చెరువును కాపాడతామని చెప్పారు. మల్‌రెడ్డి రంగారెడ్డి ఎన్నికలకు ముందు పలుమార్లు చెరువును సందర్శించి, పరిరక్షణకు చర్యలు చేపట్టాలని అప్పటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాట ప్రకారం ఇటీవల అసెంబ్లీలో ఈ అంశాన్ని లేవనెత్తడంతో అధికారులు దిగివచ్చారు.

600 టిప్పర్ల మట్టి

మట్టి తొలగింపు పనులు ప్రారంభించిన అధికారులు గురువారం 20 టిప్పర్ల మట్టిని మాత్రమే తరలించగలిగారు. తుర్కయంజాల్ నుంచి బండ రావిరాలకు తరలిస్తున్నారు. సుమారు 600 టిప్పర్లకు పైగా మట్టిని డంప్ చేయడంతో దీన్ని తొలగించాలంటే నెల రోజులకు పైగా శ్రమించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వానికి ఇది ఆర్థికంగా కూడా భారం కానుంది. ఇటీవల చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని సర్వే నంబర్‌లు 173, 175లోనూ మట్టి డంప్ చేసిన వ్యక్తిపై కేసులు నమోదు చేసి, మట్టిని తొలగించిన విషయం తెలిసిందే. ఆలస్యంగానైనా ప్రభుత్వం స్పందించి చెరువు పరిరక్షణకు చర్యలు చేపట్టడం హర్షించదగ్గ పరిణామమని స్థానికుల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పదో తరగతి పరీక్షలకు ప్రత్యేక బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: పదో తరగతి పరీక్షల కోసం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు బస్సులు అందుబాటులో ఉంటాయి. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లి, పరీక్ష అనంతరం తిరిగి ఇళ్లకు చేరుకొనేందుకు అనుగుణంగా బస్సులను అందుబాటులో ఉంచుతారు. ఈ బస్సుల్లో బాలికలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణ సదుపాయం లభించనుండగా, బాలురకు తమ సీజనల్, రూట్ పాస్‌లపై పరీక్ష కేంద్రాల వరకు ఉచితంగా ప్రయాణం చేయొచ్చు. అయితే.. పదో తరగతి హాల్ టికెట్‌ను కండక్టర్‌కు చూపించాల్సి ఉంటుంది. బస్సుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు.

భూసేకరణ నోటిఫికేషన్ రద్దు చేయించండి



ముదిరెడ్డి కోదండరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మొండిగౌరెల్లి గ్రామస్తుల వినతి


యాచారం: 'సార్ మా భూములను కాపాడే బాధ్యత మీదే.. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి పారిశ్రామిక పార్క్‌ల కోసం వేసిన భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయించండి' అంటూ మొండిగౌరెల్లి గ్రామస్తులు రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డిని వేడుకున్నారు. ఈ మేరకు నగరంలోని వ్యవసాయ కమిషన్ కార్యాలయంలో గురువారం ఆయన్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. పండించుకునే భూములు పోతే జీవనోపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన కోదండరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

మద్దతుగా ఉండండి

సర్కార్ భూసేకరణ నోటిఫికేషన్ రద్దు చేసే వరకు పోరాడతామని, తమ పోరాటానికి మద్దతుగా నిలవాలని గ్రామానికి చెందిన పలువురు రైతులు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో కలిసి విజ్ఞప్తి చేశారు. విషయాన్ని మాజీ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు మేకల యాదగిరిరెడ్డి, మర్రిపల్లి అంజయ్య యాదవ్, బండిమీది కృష్ణ, తాండ్ర రవీందర్, సంగెం రవి, కుంచారపు సందీప్‌రెడ్డి, ఎడెల్లి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి అనుమతి.. ఎంతో సులభం

అందుబాటులోకి వచ్చిన 'బిల్డ్ నౌ'



సాక్షి, సిటీబ్యూరో: సామాన్యులు సైతం సులభంగా ఇంటి నిర్మాణ, లే ఔట్ అనుమతులు పొందేలా ప్రభుత్వం కొత్తగా అందుబాటులోకి తెచ్చిన 'బిల్డ్ నౌ' ను జీహెచ్ఎంసీ అందుబాటులోకి తెచ్చింది. 'బిల్డ్ నౌ'తో భవన నిర్మాణ అనుమతుల కోసం ఎంతో కాలం వేచి చూడాల్సిన అవసరం ఉండదు. స్థలం ఎంత విస్తీర్ణంలో ఎన్ని అంతస్తులు నిర్మించవచ్చో, వదలాల్సిన సెట్‌బ్యాక్‌లు తదితర భవన నిర్మాణ నిబంధనల సమాచారం తెలుపుతుంది. సామాన్యులు ఇంటి అనుమతికి దరఖాస్తు చేసుకున్నా ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూజర్ ఫ్రెండ్లీగా పని చేస్తుందని, డ్రాయింగ్స్ పరిశీలన నిమిషాల్లోనే పూర్తవుతుందని జీహెచ్ఎంసీ చీఫ్ సిటీప్లానర్ శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం టీజీబీపాస్‌లో ఇన్‌స్టంట్ అప్రూవల్‌కు, మిగతా అనుమతులకు వేర్వేరు విండోస్ ఉండగా, బిల్డ్ నౌలో అన్నింటికీ ఒకే విండోతో త్వరితగతిన అనుమతులు జారీ అవుతాయి. భవన నిర్మాణం పూర్తయ్యాక ఎలా ఉంటుందో కూడా త్రీడీలో చూపుతుంది. ప్రస్తుతం జీహెచ్ఎంసీలో ప్రారంభించిన దీన్ని క్రమేపీ హెచ్ఎండీఏ, డీటీసీపీ, తెలంగాణ మొత్తం అమల్లోకి తేనున్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా గురువారమే ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తులు చేసుకున్న ముగ్గురికి అనుమతులు జారీ చేశారు.

ఇలా పని చేస్తుంది..

- ఏఐతో పాటు సురక్షిత డిజిటల్ ట్రాన్సాక్షన్, స్థలం పరిమాణానికి సంబంధించిన అవగాహన, ఆటోమేషన్ వంటి వాటితో అత్యంత వేగంగా అనుమతుల జారీ.
- దేశంలోనే అత్యంత వేగవంతమైన డ్రాయింగ్ వ్యవస్థ సులభతరం.. మెరుపువేగం.
- 5 నిమిషాల్లోపునే డ్రాయింగ్ పరిశీలన పూర్తవుతుంది. ఇప్పటి వరకు 2–30 రోజుల సమయం పట్టేది.
- అధునాతన క్యాడ్ ప్లగిన్. డిజైన్ సాఫ్ట్‌వేర్‌తో ప్రత్యక్ష అనుసంధానం.
- డ్రాయింగ్స్ నిబంధనలకు అనుగుణంగా ఉన్నదీ లేనిదీ తక్షణమే నిర్ధారిస్తుంది.

ఎన్ని అంతస్తులైనా..

- ఇప్పటి వరకు డ్రాయింగ్స్ పరిశీలనకే ఎన్నో రోజులు పట్టేది. బిల్డ్‌నౌతో 7.7 ఎకరాల విస్తీర్ణంలోని హైరైజ్ భవనాలకు, 33 అంతస్తులున్న 5 టవర్లకు, 12 అంతస్తుల ఎమినిటీస్ బ్లాక్‌కు, 22 లక్షల చదరపు అడుగుల బిల్టప్ ఏరియా భవనాలకైనా 5 నిమిషాల్లోనే పరిశీలన పూర్తవుతుంది.
- సింగిల్ విండోతో వివిధ ప్రభుత్వ విభాగాల వద్దకు వెళ్లాల్సిన పనిలేదు.
- జియో ఇంటెలిజెన్స్‌తో ఆటోమేటిక్‌గానే మాస్టర్‌ప్లాన్‌లు, సంబంధితమైనవి పరిశీలిస్తుంది.
- అడ్వాన్స్‌డ్ క్యాడ్ ప్లగిన్ భారీ భవనాలకు సైతం ఆర్కిటెక్టులు, ఇంజినీర్ల సమయాన్ని తగ్గిస్తుంది. వారాలు, నెలల నుంచి రెండు మూడు రోజులకు తగ్గుతుంది.
- క్యాడ్ ప్లగిన్ వినియోగానికి సంబంధించి వెబ్‌సైట్ నుంచి వన్ టూ వన్ వీడియో కన్సల్టేషన్ కూడా జరపొచ్చని చెబుతున్నారు.
- సిటిజెన్ సెంట్రిక్ డిజైన్‌తో పనిచేస్తుంది.

- సాధారణ లోపాలు నివారిస్తూ దరఖాస్తు ప్రక్రియ సులభతరం చేస్తుంది.
- వాట్సాప్ ద్వారానూ అప్‌డేట్స్ తెలియజేస్తుంది. ప్రాసెస్ ఫ్లోను దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు.
- సందర్భానుసారం మారే ఫీజులు, టారిఫ్‌లు, ప్రాసెసింగ్ ఫీజులు తక్షణమే నవీకరించుకోవచ్చు. 360 డిగ్రీస్ పారదర్శకత.
- స్థూల, సూక్ష్మస్థాయిల్లో ప్రాజెక్ట్ పరిస్థితి, పనితీరు పరిశీలన.
- వివిధ ప్రభుత్వ విభాగాలతో సమన్వయం.
- పట్టణ నియమ నిబంధనలు మార్పుల్ని క్షణాల్లో అప్‌డేట్ చేసుకోవచ్చు.
- పాలసీ ఆధారిత అప్‌డేట్స్‌ను రిపోర్టులు, చట్టపర పత్రాల్లో అమలు చేయొచ్చు.
- అందరికీ అర్థమయ్యేలా ఇంగ్లిష్‌తో పాటు తెలుగు, ఉర్దూ భాషల్లోనూ ఉంటుంది.

డీసీఎం బీభత్సం

- రెండు బైక్‌లు, మినీ డీసీఎంను ఢీకొట్టిన వైనం
- రోడ్డుపైనే బోల్తా పడిన మినీ డీసీఎం
- బైక్‌లపై వెళ్తున్న నలుగురికి గాయాలు


సాగర్‌రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో డీసీఎంలో ఇరుక్కున్న ద్విచక్ర వాహనం


నడిరోడ్డుపై పల్టీ కొట్టిన మినీ వ్యాన్

ఇబ్రహీంపట్నం రూరల్: అ దుపు తప్పిన డీసీఎం వ్యాన్ బీభత్సం సృష్టించింది. వరుసగా ఐదు వాహనాలను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఓ ఇంజనీరింగ్ విద్యార్థి ప్రాణాపాయం నుంచి త్రుటిలో బయటపడ్డాడు. నాగార్జునసాగర్ రహదారి చింతపల్లిగూడ గేటు సమీపంలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. వడ్ల లోడుతో వెళ్తున్న డీసీఎం అంబేడ్కర్ విగ్రహం వద్ద యూటర్న్ తీసుకుంటున్న మినీ డీసీఎంను ఢీకొట్టింది. దీంతో మినీ డీసీఎం నడిరోడ్డుపై పల్టీ పడింది. అనంతరం ఫ్యామిలీతో వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టగా ఇద్దరు మహిళలు, ఓ వ్యక్తి కిందపడిపోయారు. అదే వేగంతో వెళ్లిన డీసీఎం ఇబ్రహీంపట్నం నుంచి బొంగ్లూర్ వైపు వెళ్తున్న మరో బైక్‌ను ఢీకొట్టడంతో ఓ ఇంజనీరింగ్ విద్యార్థికి గాయాలయ్యాయి. ప్రమాద స్థలంలో ఉన్నవారు ఇది చూసి భయభ్రాంతులకు గురయ్యారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, మంచాల సీఐ మధు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఈ మేరకు కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యం


బచ్చమ్మ (ఫైల్)

కేశంపేట: ఫిట్స్‌తో బాధపడుతూ ఇంట్లో నుంచి వెళ్లిన వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని సంగెం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బ్యాగరి బచ్చమ్మ (65) పదేళ్లుగా ఫిట్స్‌తో బాధపడుతోంది. అప్పుడప్పుడు మతిస్థిమితం కోల్పోతుంది. ఈనెల 17న చెప్పాపెట్టకుండా ఇంట్లో నుంచి వెళ్లింది. అప్పటి నుంచి కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో బచ్చమ్మ కుమారుడు భ్యాగరి శేఖర్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నరహరి తెలిపారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం



ఆమనగల్లు: పట్టణంలోని సురసముద్రం చెరువులో గురువారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఒడ్డుకు కొట్టుకువచ్చిన శవాన్ని చూసిన పలువురు పోలీసులకు సమాచారం అందించడంతో పోస్టుమార్టం నిమిత్తం బాడీని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయసు ఉంటుందని, కాఫీ కలర్ షర్ట్, బ్లూ కలర్ జీన్స్‌ప్యాంటు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఎవరైనా గుర్తు పడితే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ వెంకటేశ్ సూచించారు.

సీఎంపై పరువు నష్టం కేసు.. విచారణ 27కు వాయిదా

సిటీ కోర్టులు : సీఎం రేవంతర్‌రెడ్డిపై బీజేపీ పార్టీ దాఖలు చేసిన పరువునష్టం కేసు విచారణ గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు (స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్)లో జరిగింది. ఈ కేసు విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరు కావడంతో విచారణను ఈనెల 27కు కోర్టు వాయిదా వేసింది. ఫిర్యాదుదారుడు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు కూడా గైర్హాజరయ్యారు. ప్రతివాది అయిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ కార్యాకలాపాలన నేపథ్యంలో ఆయన కోర్టుకు రాలేకపోయారని ఆయన తరుపు న్యాయవాదులు విశ్వేశ్వర్‌రావు, కుర్మ నరేందర్ కోర్టుకు సూచిస్తూ గైర్హాజరు పిటిషన్ దాఖలు చేశారు.

ప్రైవేటు హాస్టళ్ల ఇష్టారాజ్యం!

ప్రైవేటు హాస్టళ్లపై పర్యవేక్షణ కరువైంది. పట్టించుకునే వారు లేకపోవడంతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఫీజుల దోపిడీతో పాటు.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయి. విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్నాయి. దీంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక, చదువును మధ్యలో మానేయలేక అభద్రతాభావంతో బతుకులీడుస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ
- అడ్డగోలుగా ఫీజుల వసూలు
- వసతిగృహం మాటున అఘాయిత్యాలు
- ప్రశ్నార్థకంగా విద్యార్థినుల భద్రత


ఆదిబట్ల మున్సిపాలిటీలో హాస్టళ్లు


మంగళ్‌పల్లిలో వసతిగృహాన్ని సీజ్ చేస్తున్న పోలీసులు(ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల మున్సిపాలిటీలు విద్యాసంస్థలకు నిలయంగా మారాయి. రాజధాని హైదరాబాద్‌కు చేరువలో ఉండటంతో సుమారు 40 వరకు ప్రైవేటు ఇంజనీరింగ్, ఇంటర్మీడియెట్ కళాశాలలు, కార్పొరేట్ విద్యాసంస్థలు నెలకొన్నాయి. దీంతో రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా.. అనేక మంది విదేశాల నుంచి సైతం వచ్చి ఇక్కడే విద్యనభ్యసిస్తున్నారు. వీరంతా స్థానిక వసతి గృహాల్లో ఉంటున్నారు.

అనుమతి రెసిడెన్షియల్.. నిర్మాణం?

ఇబ్రహీంపట్నం మండలం, మున్సిపాలిటీ, ఆదిబట్ల పురపాలికలోని మంగళ్‌పల్లి, టీసీఎస్ ఎదుట అడ్డగోలుగా నిర్మాణాలు చేపట్టారు. రెసిడెన్షియల్ అనుమతితో కమర్షియల్ నిర్మాణాలు చేపట్టారు. జీప్లస్– 2 పర్మిషన్ పొంది, నాలుగైదు అంతస్తులు లేపారు. ఇలా మొత్తం 300 వరకు హాస్టళ్లు వెలిశాయి. ఒక్కో వసతిగృహంలో 100 నుంచి 150 మంది విద్యార్థులు ఉండగా.. ఒక్కొక్కరి నుంచి నెలకు రూ.6 వేలకు పైగా వసూలు చేస్తున్నారు. విద్యార్థులతో కలిపి మొత్తం 30 వేల మందికిపైగా ప్రైవేటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు సైతం హాస్టళ్లలో గడుపుతున్నారు.

కొరవడిన భద్రత..

హాస్టళ్లలో భద్రత కొరవడింది. విద్యార్థులు, ఉద్యోగులకు కనీస సౌకర్యాలు కల్పించకుండానే నిర్వహిస్తున్నారు. పీల్చుకోవడానికి గాలి, చదువుకోవడానికి వెలుతురు కూడా లేదని పలువురు వాపోతున్నారు. ఇక సీసీ కెమెరాలు లేవు. అగ్నిమాపక శాఖ అనుమతితో పాటు.. అగ్ని ప్రమాదం చోటుచేసుకుంటే మంటలు ఆర్పడానికి ఫైర్‌సేఫ్టీ పరికరాలు ఎక్కడా కనిపించడం లేదు. వీటికి ఎన్‌ఓసీ, ట్రేడ్ లైసెన్స్, అనుమతి అనే మాటలే తెలియదు. కేవలం పుడ్డు, బెడ్డుతో సరిపెట్టి దండుకుంటున్నారు.

అఘాయిత్యాలు!

వసతి గృహాల పేరుతో పలువురు నిర్వాహకులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇటీవల మంగళ్‌పల్లిలోని ఓ హాస్టల్లో ఇంజినీరింగ్ విద్యార్థినిపై లైంగిక దాడి జరిగింది. అదే ప్రాంతంలో ఒకటి, రెండు హాస్టళ్లలోని విద్యార్థినులను లోబర్చుకొని గోవా తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి దాడులకు పాల్పడిన ఘటనలు ఉన్నాయి. కానీ ఇవేవి బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇబ్రహీంపట్నంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినిపై విచక్షణా రహితంగా దాడి చేశారు. టీసీఎస్ ఎదుట నిత్యం వికృత చేష్టలకు ఒడిగడుతున్నారు. పర్యవేక్షణ కొరవడంతో నిర్వాహకులతో పాటు.. విద్యార్థులు, ఉద్యోగులు దురలవాట్లకు బానిసలుగా మారుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ



ఇబ్రహీంపట్నం, మంగళ్‌పల్లి, ఆదిబట్ల ప్రాంతాల్లో చాలా హాస్టళ్లు ఉన్నాయి. వీటిని పట్టించుకునే వారు లేకపోవడంతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. అధిక ఫీజులను వసూలు చేస్తున్నాయి. విద్యార్థులకు నాసిరకమైన భోజనం పెడ్తున్నారు. అధికారులు పర్యవేక్షించాలి. లేదంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.

– బాయికాడి శంకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

కట్టడి చేస్తున్నాం



ప్రైవేటు హాస్టళ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. నిర్వాహకుల నిర్లక్ష్యం పెనవేసుకుంది. తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఏమైనా అసాంఘిక సంఘటనలు జరిగితే బాధ్యులవుతారు. ఇప్పటికే మంగళ్‌పల్లిలో ఓ వసతి గృహాన్ని మూసివేశాం. అవసరమైతే క్రిమినల్ కేసులు పెడతాం. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి. పోలీసులు అండగా ఉంటారు.

– జగదీశ్వర్, సీఐ, ఇబ్రహీంపట్నం

దుబాయ్ పబ్‌లో హైదరాబాదీ డ్యాన్సర్‌కు వేధింపులు..

బంజారాహిల్స్: దుబాయ్‌లో ఓ పబ్‌లో డ్యాన్సర్‌గా పనిచేస్తున్న హైదరాబాదీ యువతికి అక్కడే పరిచయమైన యువకుడు మానసిక వేధింపులకు గురిచేయడంతో పాటు ఆమె భర్త, కుటుంబ సభ్యులకు వ్యక్తిగత వీడియోలు షేర్ చేస్తూ బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ బాధిత డ్యాన్సర్ జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు దుబాయ్‌కు చెందిన నౌషాద్ అబూ బాకర్‌పై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లో నివసించే యువతి (38) 2018 అక్టోబర్ 6వ తేదీన ఉపాధి నిమిత్తం దుబాయ్‌కు వెళ్లింది. దుబాయ్‌లోని సౌత్ ఇండియా పబ్‌లో డ్యాన్సర్‌గా చేరింది. పబ్ సూపర్‌వైజర్ ఆమెకు ఏదైనా పని ఉంటే నౌషాద్ అబూబాకర్‌ను సంప్రదించాలని నెంబర్ ఇచ్చాడు. అప్పటి నుంచి తరచూ నౌషాద్ ఆమెతో ఫోన్‌లో మాట్లాడేవాడు. అయితే వీడియోలు తీసుకుని కొంతకాలంగా బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్నాడు. 2020లో ఆమె హైదరాబాద్‌కు తిరిగివచ్చింది. ఆ సమయంలోనే అబూబాకర్ ఆమెతో ఫోన్‌లో మాట్లాడుతూ తిరిగి దుబాయ్ పబ్‌కు రావాలని, లేకపోతే వీడియోలు, ఫోటోలు కుటుంబసభ్యులకు షేర్ చేస్తానంటూ బెదిరించడంతో ఆమె తిరిగి దుబాయ్‌కు వెళ్లింది. ఇద్దరి మధ్య వీడియోల విషయంలో గొడవ జరిగింది. ఫోన్‌లో నుంచి వీడియోలు, ఫోటోలు డిలీట్ చేయాలని సూచించి తిరిగి హైదరాబాద్‌కు వచ్చింది. ఆరు నెలల తర్వాత అబూబాకర్ దుబాయ్ నుంచి హైదరాబాద్ వచ్చి ఆమెకు ఫోన్ చేశాడు. ఇంటి నుంచి బయటకు రావాలని లేకపోతే భర్తతో పాటు కుటుంబ సభ్యులకు వీడియోలు పంపిస్తానని బెదిరించాడు. అయినా ఆమె వెళ్లకుండా ఇంట్లోనే ఉండిపోయింది. ఇదే అదునుగా నిందితుడు ఆమె ఫోటోలు, వీడియోలను భర్తకు, కుటుంబ సభ్యులకు పంపించాడు. తాను ఆమెను పెళ్లి చేసుకున్నానని, వదిలిపెట్టాలంటూ భర్తను హెచ్చరించాడు. ఈ వేధింపులు తట్టుకోలేక, అబూబాకర్ బ్లాక్‌మెయింలింగ్ భరించలేక బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు పిల్లలతో గృహిణి అదృశ్యం

శంషాబాద్ రూరల్: నాలుగేళ్ల కుమారుడు సరిగా చదువుకోవడంలేదని తల్లి చెంచాతో వాత పెట్టింది.. దీంతో భర్త ఫోన్‌లో భార్యను మందలించాడు. మనస్తాపం చెందిన ఆమె ఇద్దరు పిల్లలను తీసుకుని వెళ్లిపోయింది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన మేరకు.. చిన్నగొల్లపల్లికి చెందిన చింతమోని మల్లేష్, భవాని(22) దంపతులకు లవకేష్(4), పదకొండు నెలల కూతురు ఉంది. డ్రైవర్‌గా పని చేసే మల్లేష్ ఈ నెల 19న ఇంటి నుంచి తొండుపల్లికి పని కోసం వెళ్లాడు. కుమారుడు బాగా చదవడంలేదనే కోపంతో భవాని అతనికి చెంచాతో వాత పెట్టింది. ఈ విషయం మల్లేష్ తమ్ముడు రమేష్ గమనించి తన అన్నకు ఫోన్‌లో చెప్పాడు. దీంతో మల్లేష్ తన భార్యకు ఫోన్ చేసి ఈ విషయంపై మందలించాడు. కాసేపటికి భవాని తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. వారి కోసం అన్ని చోట్ల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సునీతా విలియమ్స్ రాకపై సంబురాలు

బషీరాబాద్: భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్ క్షేమంగా భూమికి తిరిగి రావడంతో విద్యార్థులు కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. మండలంలోని కొర్విచెడ్ ఎంపీపీఎస్‌లో గురువారం హెచ్‌ఎం నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు విలియమ్స్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి భూమికి దిగివచ్చిన చాయచిత్రాలు గీసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. మహిళలు తలుచుకుంటే ఏదైన సాధిస్తారనే దానికి సునీతా విలియమ్స్ నిదర్శనమన్నారు. ఆమెను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాజియా, జయశ్రీ, ప్రియాంక, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ స్టిక్కర్ వాడిన ఇద్దరి అరెస్టు

పంజగుట్ట: మంత్రి సీతక్క ఎమ్మెల్యే కారు స్టిక్కర్ వివాదంలో ఇద్దర్ని అదుపులోకి తీసుకున్న పంజగుట్ట పోలీసులు వారిని గురువారం రిమాండ్‌కు తరలించారు. మంత్రి సీతక్క పేరుతో ఉన్న ఫేక్ వెహికిల్ పాస్ ఎమ్మెల్యే స్టిక్కర్‌ను ఓ వ్యక్తి తన మహేంద్రా థార్ కారుకు వాడుతున్నాడు. ఇది గమనించిన సీతక్క పీఆర్‌ఓ పాండు పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మహబూబ్‌నగర్‌కు చెందిన కృష్ణా యాదవ్ అలియాస్ కిట్టు (37), భాను ప్రసాద్ యాదవ్ అలియాస్ భాను (37) లను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచారు. వీరికి స్టిక్కర్ ఎక్కడనుండి వచ్చింది, ఎవరు ఇచ్చారు అన్న విషయంపై ఆరాతీస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

అఫ్జల్‌గంజ్: గంజాయి తరలించే ముఠాను పట్టుకుని వారి వద్ద నుండి రూ.2.45 లక్షల విలువ గల 7 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. దక్షిణ, తూర్పు జోన్ టాస్క్‌ఫోర్స్ బృందంలోని ఇన్‌స్పెక్టర్ ఎస్.సైదాబాబు, అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ సునావత్ రవి తెలిపిన మేరకు.. గౌలిగూడలోని శ్రీరామ్‌ఘర్ హనుమాన్ మందిర్ సమీపంలోని బస్ పార్కింగ్ స్థలంలో గంజాయి కలిగి ఉన్న ముగ్గురు ఉన్నట్లు సమాచారం అందింది. దీంతో వారిని అరెస్టు చేసి 7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బైజయంతి తక్రీ అలియాస్ చాందిని టక్రి(36), గౌరీ జురా(35) , ధనర్జయ ఖిలా అలియాస్ ధనుఖరా(22)లను అదుపులోకి తీసుకున్నారు.

నేను బుల్లెట్‌పైనే తిరుగుతా

పోలీసులకు సమాధానం ఇచ్చిన ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: బుల్లెట్ ప్రూఫ్ వాహనంతోపాటు భద్రతా సిబ్బందిని ఉపయోగించుకోవాలని మంగళ్‌హాట్ పోలీసులు రాజాసింగ్‌కు నోటీసులు జారీ చేశారు. అయితే తాను మాత్రం బుల్లెట్ పైనే తిరుగుతానంటూ పోలీసులకు రాజాసింగ్ సమాధానం ఇచ్చారు. ఇటీవల రాజాసింగ్‌కు బెదిరింపు కాల్స్ రావడంతో అప్రమత్తంగా ఉండాలని గురువారం పోలీసులు ఆయనకు మరోసారి సూచించారు. ఎక్కడికైనా వెళ్తే ప్రభుత్వం కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం , వన్ ప్లస్ ఫోర్ సెక్యూరిటీని వినియోగించుకోవాలని, ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు. రాజాసింగ్ ఉగ్రవాదుల హిట్ లిస్ట్‌లో ఉన్న సంగతిని వారు గుర్తు చేశారు. అయితే ప్రజల వద్దకు తన బుల్లెట్ వాహనాన్ని వాడుతున్నట్లు ఎమ్మెల్యే రాజాసింగ్ వెల్లడించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..... గోషామహల్ నియోజకవర్గంలో నిరుపేద రోడ్లు ఉన్నాయని తాను ప్రజలను కలవాలంటే బుల్లెట్ వాహనం, బైక్‌పై వెళ్లాల్సి వస్తుందన్నారు. భద్రతా కారాణాల వల్ల తాను గతంలో గన్‌లైసెన్స్ కోసం అప్లయ్ చేస్తే తనపై కేసులు ఉన్నాయని పోలీసు శాఖ తన దరఖాస్తును తిరస్కరించిందని ఎమ్మెల్యే రాజాసింగ్ వివరించారు.

భారీ అగ్నిప్రమాదం.. నిర్మాణంలోఉన్న కన్వెన్షన్ దగ్ధం

సుమారు రూ.ఏడుకోట్లు నష్టం


అగ్నిప్రమాదం జరిగిన ఈకేఏఎం కన్వెన్షన్

శంషాబాద్ : మరో 15 రోజుల్లో ప్రారంభిచేందుకు సిద్ధమవుతోన్న కన్వెన్షన్ అగ్నికి ఆహుతైంది. ఈ సంఘటన శంషాబాద్ పట్టణంలోని తొండుపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు.. తొండుపల్లి నుంచి హమీదుల్లానగర్ వెళ్లే రహదారిలో బాలాపూర్‌కు చెందిన శ్రీధర్ కన్వెన్షన్ నిర్మాణం చేపట్టాడు. ఏప్రిల్ 4 తేదీన ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. గురువారం ఉదయం 10 గంటల సమయంలో వెల్డింగ్ పనులు జరుగుతుండగా నిప్పురవ్వలు పడి మంటలంటుకున్నాయి. కొద్ది సమయంలోనే మెటీరియల్ మొత్తం అగ్నికి ఆహుతైంది. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని రెండు ఫైరింజన్‌లతో మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ప్రమాదం జరిగిన సమయంలో లోపల 20 మందికి పైగా కార్మికులు ఉన్నప్పటికి ఎలాంటి ప్రాణాపాయం చోటు చేసుకోలేదు. సుమారు ఏడు కోట్ల రూపాయల మేర ఆస్తినష్టం జరిగి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

'నిషేధాజ్ఞలతో ప్రభుత్వానికి సంబంధం లేదు'


పాలనా భవనం ఎదుట విద్యార్థుల నిరసన ధర్నా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో నిషేధాజ్ఞలతో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ నాయకులు, నిరుద్యోగ జేఏసీ, ఓయూ విద్యార్థి జేఏసీ నాయకులు గురువారం తెలిపారు. నిషేధాజ్ఞలు కేవలం ఓయూ వీసీ ప్రొ.కుమార్ నిర్ణయం అన్నారు. ఒక వేళ ప్రభుత్వం వర్సిటీ విద్యార్థుల ఆందోళనల పై విధిస్తే రాష్ట్రంలోని అన్ని వర్సిటీలకు ఉత్తర్వులు జారీ చేస్తుందన్నారు. సర్క్యులర్ రద్దుకు కృషి చేయనున్నట్లు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఓయూ పాలనా భవనం ఎదుట నిరసన ధర్నా

ఓయూలో జారీ చేసిన నిషేధాజ్ఞల సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ గురువారం పాలన భవనం ఎదుట ఓయూ ఐక్య విద్యార్థి సంఘాలజేఏసీ ఆధ్వర్యంలోనిరసనధర్నా చేపట్టారు.

17 మంది వామపక్ష విద్యార్థి నేతల అరెస్ట్

సర్క్యులర్‌ను రద్దు చేయాలని వామపక్ష విద్యార్థి నేతల బంద్‌ను పోలీసులు అడ్డుకున్నారు. గురువారం ఆర్ట్స్ కాలేజీలో తరగతులు బహిష్కరించి ప్రవేశ ద్వారం వద్ద నినాదాలు చేసిన ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, పీడీఎస్‌యూ (విజృంభణ), పీఎస్‌యూ, ఏఐడీఎస్‌వోలకు సంబంధించిన 17 మంది నాయకులను అరెస్ట్ చేసి లాలాగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

16 మందికి కారుణ్య నియామకాలు


ఎంపికైన వారితో బయలు దేరుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

అనంతగిరి: వికారాబాద్ జిల్లాలో కారుణ్య నియామకం కింద 16 మందిని ఎంపిక చేశారని అదనపు కలెక్టర్ సుధీర్ తెలిపారు. గురువారం కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపికైన వారిని బస్సులో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. సాయంత్రం నాలుగు గంటలకు రవీంద్ర భారతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీరికి నియామక పత్రాలు అందజేశారని తెలిపారు.

యుద్ధంతో అల్లకల్లోలం... అయినా కలల సాకారం

- ఉజ్బెకిస్థాన్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన 150 మంది భారతీయ విద్యార్థులు
- స్నాతకోత్సవానికి హాజరైన ఏఐజీ ఆస్పత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

రాయదుర్గం: రష్యా – ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధంతో అల్లకల్లోలం సాగుతున్నా ఎంబీబీఎస్ విద్యార్థుల కలలు సాకారమయ్యాయి. ఉజ్బెకిస్థాన్‌లో విజయవంతంగా ఎంబీబీఎస్ పూర్తి చేసిన భారతీయ విద్యార్థుల స్నాతకోత్సవ కార్యక్రమాన్ని గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో గురువారం ఘనంగా నిర్వహించారు. నియో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నియో విద్యార్థుల గ్రాడ్యుయేషన్ ఏఐజీ ఆస్పత్రిలో మూడో సంవత్సరం నిర్వహించడం విశేషం. అత్యంత నైపుణ్యం కలిగిన వైద్య విద్యార్థులను తీర్చిదిద్దడంలో నియో ఖ్యాతి మరోసారి రుజువైనట్లయ్యింది.

- రష్యా –ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధం మొదలయ్యాక వీరందరినీ ఉక్రెయిన్ నుంచి ఉజ్బెకిస్థాన్‌కు తరలించారు. ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామినేషన్ (ఎఫ్ఎంజీఈ)లో నియో విద్యార్థుల అసాధారణ విజయం ఈ కార్యక్రమంలో అందరినీ ఆకట్టుకుంది. గ్రాడ్యుయేషన్‌లో సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు ఏఐజీ ఆస్పత్రి ఆడిటోరియంలో సందడి చేశారు. అంతా ఉత్సాహంగా గడిపి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఉజ్బెకిస్థానేలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన 150 మంది విద్యార్థుల్లో 114 మంది(76శాతం) విద్యార్థులు తమ తొలి ప్రయత్నంలోనే ఎఫ్ఎంజీఈలో ఉత్తీర్ణులయ్యారు.

డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి అవిసెన్నా అవార్డు, గౌరవ ప్రొఫెసర్ పదవితో సత్కారం.....

ప్రపంచ వైద్య, విద్య, ఆరోగ్య సంరక్షణకు చేసిన కృషిని గుర్తిస్తూ ఏఐజీ ఆస్పత్రి వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి అవిసెన్నా అవార్డు, గౌరవ ప్రొఫెసర్ పదవితో ఆయనను సత్కరించారు. ఉజ్బెకిస్థాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ద్వారా ఆయనను సత్కరించారు. అంతేకాకుండా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి, ఆర్టీఐ మాజీ కమిషనర్ విజయ్‌బాబు గౌరవ డాక్టరేట్లు ప్రకటించగా డాక్టర్ సందీప్‌కు గౌరవ ప్రొఫెసర్ పదవిని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉజ్బెకిస్థాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులు, బుఖారా స్టేట్ మెడికల్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిదులు, ఉజ్బెకిస్థాన్ రాయబార కార్యాలయ సభ్యులు పాల్గొన్నారు.